

# పల్లెసిగలో మందారం

# సర్పంచ్ కాళింగి లలిత

**నాడు నర్సుగా, నేడు సర్పంచ్‌గా గ్రామానికి సేవలు**

**ఇండిపెండెంట్‌గా బరిలో దిగి ప్రజామద్దతుతో ఘన విజయం**

**భర్త డేవిడ్ ప్రోత్సాహంతో ఆదర్శ సర్పంచ్‌గా పేరు**

**జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అండతో గ్రామానికి అభివృద్ధి బాటలు**

**వనం నాగయ్య, కెరటం న్యూస్**

'పదవులు, అధికారం కంటే సేవా భావం ఎంతో గొప్పది..' ఈ మాటలు అన్నది మరెవరో కాదు..సాక్షాత్తూ భారత దేశపు తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ.. మరొక సందర్భంలో నెహ్రూ గారే మాట్లాడుతూ పూలల్లో సువాసన, వ్యక్తులలో యోగ్యత దాచినా దాగవు.. అని చెప్పారు.. ఇక్కడ ఈ రెండు వాక్యాలు ఎందుకు చెప్పాల్సి వచ్చిందటే.. మానవ జీవితంలో ఎంతో విలువైన విషయాలుగా చెప్పుకునే ఈ జీవిత సత్యాలను తన జీవితంలో నిజం చేసి చూపించింది ఓ అతివ. మహిళ అంటే పురుషుల కన్నా తక్కువేం కాదని నిరూపించి తనేంటో రుజువు చేసుకుంది. ఇంతకూ ఎవరా మహిళా ప్రతినిధి, ఏమిటా గొప్పతనం తెలుసుకోవాలంటే ఒక సారి ఈ కథనం చదవాల్సిందే...

## నాడు నర్సు..నేడు సర్పంచ్..

ఖమ్మం జిల్లా చింతకాని మండలం గాంధీనగర్ కాలనీ గ్రామానికి చెందిన గ్రామ మొదటి పౌరురాలు, గ్రామ సర్పంచ్ కాళంగి లలిత తనకు అందివచ్చిన ఒక అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాన్ని తన కుటుంబంలా చూసుకుంటూ ఆదర్శ సర్పంచ్‌గా ప్రశంసలు అందుకుంటున్నారు. అధికారం ఉందనే అహంతో ఎదుటివారిని చులకన చేస్తూ తామంటే గొప్ప అని భావించేవారు ఉన్న నేటి రోజుల్లో సర్పంచ్ పదవిని పవిత్రంగా భావిస్తూ ప్రజలు తనను నమ్మి కట్టబెట్టిన సర్పంచ్ పదవికి వన్నె తెస్తూ గ్రామస్తుల తలలో నాలుకలా అందరి మన్ననలు అందుకుంటున్నారు. పదవులూ, అధికారం శాశ్వతం కాదనీ, ప్రజల అభిమానాలే తనకు శాశ్వతమని గ్రామస్తులకు ఎలాంటి సమస్య వచ్చినా తనవంతుగా సాయం చేస్తూ ముందడుగు వేస్తున్నారు. భర్త కాళంగి డేవిడ్ ప్రోత్సాహం, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు అండ, గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల సహకారంతో గ్రామానికి కావాల్సిన సౌకర్యాల కల్పనతో తన శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారు. సర్పంచ్‌గా ఎన్నిక కాకముందే నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన కాళంగి లలిత గ్రామంలో పేదలకు, అనారోగ్యం బారిన పడిన వారికి వైద్య పరంగా తన వంతుగా చిన్న పాటి వైద్యం అందించేది. భర్త గ్రామంలో అప్పటికే ఉప సర్పంచ్‌గా పనిచేస్తుండటంతో 2019 ఎన్నికల్లో గ్రామ సర్పంచ్‌గా ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగింది. నాడు అధికార టీఆర్ఎస్, కాంగ్రెస్, అభ్యర్థులకు గట్టిపోటీ ఇవ్వడమే కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా ఘన విజయం సాధించారు.







తాను గెలవడమే కాకుండా తనతో పాటు వార్డు సభ్యులుగా పోటీ చేసిన నలుగురు ( మర్రి ప్రకాశరావు, షేక్ సోందబీ, పిట్టల రవికుమార్, తునికిపాటి కళావతి) అభ్యర్థులు కూడా అద్భుతమైన విజయాలు సాధించారు. దీంతో గ్రామస్తులు కోరుకున్నట్టుగా వీరంతా తమ పాలకవర్గంలో సాధ్యమైనంత మేరకు అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నారు.

## మూడు దశాబ్దాల సమస్యకు మోక్షం..

పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిన నాటినుండి గాంధీనగర్ గ్రామం బొప్పారం గ్రామానికి ఆవాస గ్రామంగా ఉంటూ వస్తోంది. సీఎం కేసీఆర్ 500జనాభా దాటిన గ్రామాలను, తండాలను పంచాయతీలుగా మారుస్తానని ఇచ్చిన హామీ మేరకు 2018లో గాంధీనగర్ గ్రామాన్ని పంచాయతీగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మొట్టమొదటి గ్రామానికి తొలి సర్పంచ్‌గా ఎన్నికై తన పేరు చరిత్రలో లిఖించుకుంది. ఈ క్రమంలోనే తాను ఎన్నికల్లో పోటీచేసినప్పుడు గ్రామస్తులకు కాళంగి లలిత ఒక హామీ ఇచ్చింది. ముప్పై ఏండ్లుగా గ్రామంలో రేషన్ దుకాణంలేక, పందిళ్ల పల్లి వెళ్లాల్సి రావడంతో తనను గెలిపిస్తే గ్రామానికి రేషన్ దుకాణం తీసుకొస్తానని హామీ ఇచ్చి, గెలిచిన తరువాత అనేక మార్లు, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు భర్తను, వార్డు సభ్యులను వెంట పెట్టుకుని పలు మార్లు దరఖాస్తులు ఇచ్చి ఎట్టకేలకు ఇటీవల రేషన్ షాపు మంజూరు చేయించి గ్రామస్తులకు ఇచ్చిన హామీని నెరవేర్చింది.

## పల్లె సిగలో మందారం లలితడేవిడ్..

తనకు వచ్చిన సర్పంచ్ పదవిని సద్వినియోగం చేసుకుని గ్రామానికి అభివృద్ధి సొగసులు అద్దాలంటే ఇండిపెండెంట్‌గా ఉంటే నిధులు అంతగా రావన్న కారణం ఒక వైపు, గ్రామస్తుల కోరిక మరొక వైపు ఆలోచించి గెలిచిన తరువాత తన వార్డు సభ్యులతో పాటు ఆ నాడు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. చేరిన తరువాత టీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామానికి అందించి గ్రామంలో అభివృద్ధి పూలు పూయిస్తున్నారు. ప్రధానంగా జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, గ్రామ శాఖ, గ్రామస్తుల అండతో గ్రామానికి కొత్తరూపం ఇచ్చారు. ప్రధానంగా గ్రామంలో ఎల్ఈడీ లైట్లు, గ్రామంలో త్రీఫేజ్ కరెంట్, రూ.50లక్షలతో సీసీ రహదారులు, డంపింగ్ యార్డు, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న తెలంగాణ పల్లె ప్రకృతి వనం, స్మశానవాటిక, మంచినీటి సౌకర్యం, పింఛన్ అందని వారికి పింఛన్లు మంజూరుచేయించడంతో పాటు, గ్రామంలో అవసరమైన చోట్ల ట్రాన్స్ ఫారాలు, ఖమ్మం బోనకల్ మెయిన్‌రోడ్‌కు ఖరీదైన ఎల్ఈడీ లైట్లు, సొంత ఇల్లు ఉండి రిజిస్ట్రేషన్ పట్టాలు లేని వారికి ఆన్‌లైన్ సౌకర్యం కల్పించారు. ఉపాదిహామీ పథకాన్ని గ్రామంలో కూలీలకు అమలుచేసి తన పేరు చరిత్రలో నిలిచేలా చేసుకున్నారు. కోవిడ్ సమయంలో ఒక్కటంటే ఒక్క మరణం లేకుండా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ హెూం క్వారంటైన్‌లు ఏర్పాటుచేయించి, ఆశా కార్యకర్తలు, నర్సులను గ్రామంలో కరోనా వ్యాధిగ్రస్తులకు అండగా ఉండేలా చేశారు. పేదలు చనిపోతే అంత్యక్రియలకు సాయం చేస్తూ అన సొంత కుటుంబంలా గ్రామాన్ని చూసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేశానికి తలమానికంగా చెప్పుకుంటున్న దళితబంధు పథకం కింద గ్రామంలో 75దళిత కుటుంబాలకు ఒకొక్కరికి రూ. 10లక్షల చొప్పున మొత్తం రూ. 7.5కోట్ల నిధులను పంపిణీ చేయించి అందరి కుటుంబాల్లో వెలుగులు నింపారు. సర్పంచ్ కాళంగి లలితకు ఇద్దరు( సుప్రియ, మృదుల) కూతుళ్లు ఉన్నారు.

## గ్రామానికి ఎంత సేవ చేసినా తక్కువే..కాళంగి లలిత డేవిడ్, గ్రామ సర్పంచ్, గాంధీనగర్ కాలనీ పంచాయతీ

తమను నమ్మి, ఓట్లేసి గెలిపించిన ప్రజలకు ఎంత సేవ చేసినా తక్కువేనని సర్పంచ్ లలిత అన్నారు. ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగిన తనకు గ్రామస్తులు ఇచ్చిన గెలుపు వారికే సొంతం. నా ఇల్లు నాకు ఎంత ముఖ్యమో పంచాయతీ కూడా అంతే ముఖ్యం అన్నారు. గ్రామస్తుల కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడంలో ఉన్న ఆనందం మాటల్లో చెప్పలేనని అన్నారు. అందరి ప్రోత్సాహం, సహకారంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి కృషిచేస్తామని ఆమె తెలిపారు.









